క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

కందుకూరు: జిల్లెలగూడ ఎస్వైఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించనున్న మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేసేలా ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉ. 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి సబితారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

'డబుల్' సాధించే వరకు పోరాటం



మంఖాల్‌లో ర్యాలీ తీస్తున్న స్థానికులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను స్థానికులకు కేటాయించాలని డబుల్ బెడ్‌రూమ్‌ల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన సోమవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మంఖాల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నేతలు మాట్లాడుతూ.. గ్రామస్తులను వదిలేసి నగరానికి చెందిన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వడం అన్యాయమన్నారు. పేదలకు ఇళ్లు సాధించే వరకూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయనిధి వ్యాఖ్యలు దురదృష్టకరం



ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: హిందు సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు వై.శివకుమార్, ఆర్.రాజు, బి. విలాస్, నాయకులు కృష్ణగౌడ్, సుధాకర్, శివయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నూనత కమిటీని సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: మండలంలోని నేదునూరు శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం నూతన కమిటీ చైర్మన్‌గా కల్యాణ్‌కార్ రూప్ చందర్ నియమితులయ్యారు. సభ్యులుగా శ్రీరాములు, యాదిరెడ్డి, ఎం.సరళారెడ్డి, అంజయ్యయాదవ్, చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు ఎన్నుకున్నారు. సోమవారం ఆలయంలో దేవాదాయ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ.. తన ఎంపికకు కారణమైన మంత్రి సబితారెడ్డి, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బి.శ్రీనివాస్ తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రైతు కమిటీ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్ పాండురంగారెడ్డి, నాయకుల రాకేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండల ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 16వ తేదీన విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. అలాగే 6–9 తరగతుల్లో కూడ ఖాళీలు భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిజాంను గడగడలాడించిన 'రావి'



రావినారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న రవీంద్రాచారి తదితరులు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ రావినారాయణరెడ్డి గడగడలాడించారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీంద్రాచారి గుర్తుచేశారు. రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించి.. రావినారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన నారాయణరెడ్డి రైతుల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు రైతులను ఏకం చేశారని తెలిపారు. భువనగిరి ఎంపీగా పోటీ చేసి మాజీ ప్రధానమంత్రి నెహ్రూ కంటే అధిక ఓట్లతో గెలుపొందారని తెలిపారు. సీపీఐ కార్యకర్తలంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

తుక్కుగూడ : తుక్కుగూడ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం శాంతియుత సమ్మెను ప్రారంభించారు. నిరసన చేసి, కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో పని చేసే తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాని సమయంలో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, నగేష్, దేవేందర్, సతీష్, సత్యానారాయణ, మహేష్, ధనవర్ష, కళమ్మ, చంద్రయ్య, రమేష్, శాంతమ్మ, రాములు, పద్మరావు, రాజు, మల్లప్ప ,మధు, కవిత, అర్జున్, సాయిలు, సత్తయ్య, వెంకటేష్, బాపురాజు, జ్యోతి, శ్రీరాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

హుడాకాంప్లెక్స్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. 2007 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ,డీఏలను వెంటనే ఇవ్వాలని, 2018 కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం అంగన్‌వాడీ టీచర్లకు రూ.15వేలు, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1250 బడ్జెట్ నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, హెల్త్‌కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని కోరారు.



ఆందోళన చేపడుతున్న కార్మికులు

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ అంగడి వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యులుగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, ఆర్.సంతోషి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు అమృత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, ఆనంద్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ రామిడి మల్లారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా రామిడి శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జూపల్లి కుమార్, కార్యదర్శి వెంకటేశ్, గౌరవ సలహాదారులుగా లింగారెడ్డి, కృష్ణారెడ్డి, మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తుఫాన్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చారి, పుల్లారావు, కృష్ణమోహన్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, మధుసూదన్‌శర్మ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాలనీవాసులు

పేదలకు అండ ఎర్రజెండా

తుర్కయంజాల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 4వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాకు ఉందని గుర్తుచేశారు. సాయుధ పోరాటంతో సంబంధంలేని కొన్ని పార్టీలు చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. పేదలకు అండగా ఎర్రజెండా నిలిచిందని తెలిపారు. ఈ నెల 17వ తేదీన వారోత్సవాల ముగింపు సభను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్, నాయకులు రాజు, గోవర్ధన్, శివకుమార్, ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: అభివృద్ధి పనుల్లో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధి డాక్టర్స్‌కాలనీ, జింకలబావికాలనీ, పోచమ్మ భాగ్‌ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రధానంగా డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, జనాభాకనుగుణంగా పైపులైన్ డయాను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కాలనీల్లో సంక్షేమ సంఘాల నాయకుల సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అన్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలుస్తుందని దీంతో దోమల బెడద పెరుగుతుందని చెప్పారు. వ్యాధుల బారిన పడకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా బోనాలు



బోనాలతో ఊరేగింపుగా మహిళలు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ, గూడూరు గ్రామాల్లో కట్టమైసమ్మ, మైసమ్మ, పోచమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గుమ్మడవెల్లి, రాచులూరు, ఆకులమైలారం, కొలన్‌గూడ, దెబ్బడగూడ, పులిమామిడి తదితర గ్రామాల్లో తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

పోషకాహారం.. ఆరోగ్య సోపానం



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న తల్లీబిడ్డలు

తుర్కయంజాల్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లీ బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని ఇంజాపూర్‌లోని అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజా కూరగాయలు, పండ్లు, పాలు, చేపలు, గుడ్లు, పప్పు దినుసులు వంటి ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారం ఆరోగ్య సోపానమని పేర్కొన్నారు. తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతో పాటు, అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష

ఇబ్రహీంపట్నం: అగ్రవర్ణాల పెత్తనాన్ని సహించేది లేదని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఒక రోజు నిరసన దీక్షను సోమవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు శాతమున్న.. రెడ్డి, వెలమ, కమ్మ సామాజికవర్గానికి చెందిన నాయకులే కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు అధ్యక్షులుగా ఉన్నారన్నారు. ఏ పార్టీ రాష్ట్రంలో గెలిచిన రెడ్డి, వెలమ, కమ్మలే రాజ్యమేలుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 93 శాతమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని, రాజకీయాల్లో వీరికి సమానవాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రవీందర్, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యువతీ యువకులకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. మాడ్గులలో సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, కల్వకుర్తి నియోజక వర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మాడ్గుల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు జైపాల్‌రెడ్డి, సురేశ్, శ్రీను, శంకర్‌నాయక్, శివగౌడ్, దేవేందర్ పాల్గొన్నారు.



డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను తీసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు



సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

హస్తినాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, హనుమాన్‌నగర్ టెంపుల్ డైరెక్టర్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నుంచి 200 మంది బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు సాధించుకున్న తెలంగాణాను ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌రెడ్డి, బీజేపీ నుంచి పార్టీలో చేరినవారిలో కందకట్ల శివకుమార్‌రెడ్డి, పెండ్యాల మధుసాగర్, వాకిటి సుధాకర్ రెడ్డితో పాటు రెండు వందల మంది చేరారు.

అంగన్‌వాడీల సమ్మెబాట

- అరకొర వేతనాలతో ఇబ్బందులు
- గ్రాట్యుటీ పెంచాలని డిమాండ్
- టీచర్లు, ఆయాలు విధులకు గైర్హాజరు

ఇబ్రహీంపట్నం: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సమ్మెబాట పట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు చాలీచాలని గౌరవ వేతనంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్యలను పరిష్కరించాలని సోమవారం నుంచి సమ్మెకు దిగారు. సీఐటీయూ, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించి ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాములు, ఎల్లేశ్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రవీందర్, సీఐటీయూ నాయకులు,అంగన్‌వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

మంచాల: తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మంచాల మండల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ అండర్ హెల్పర్స్ సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

యాచారంలో..

యాచారం: పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ. 26 వేలు వేతనం అందజేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, యాచారం మండల కన్వీనర్ చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రెగ్యులర్ చేయాలి

ఆమనగల్లు: అంగన్‌వాడీ కార్యకర్తలను తక్షణమే రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి కురుమయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు యాదమ్మ, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి అనసూయ, సభ్యులు పద్మ, సంగీత, కళావతి, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.



మంచాల: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

గురువులే సమాజ మార్గనిర్దేశకులు

రిటైర్డ్ ఆర్‌జేడీ లక్ష్మారెడ్డి

కడ్తాల్: ఉపాధ్యాయులే సమాజ మార్గనిర్దేశకులని రిటైర్డ్ ఆర్‌జేడీ లక్ష్మారెడ్డి కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని బటర్‌ఫ్లై సిటీ క్లబ్ హౌస్‌లో, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించారు. సన్మానసభలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో తల్లిదండ్రులతో సమానమైన బాధ్యత గురువులపై ఉంటుందన్నారు. ప్రతి ఏడాది మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని తెలిపారు. ఎంఈవో సర్దార్‌నాయక్‌తో పాటు, 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, క్లబ్ సభ్యులతో కలిసి సన్మానించారు.



లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం